# గతుకు

"ఎం.ఆర్" సైకిల్‌షాపు నుండి బాడుక్కి రిక్షా తీసుకుని గడియారం స్థంభం కాడి కొచ్చేటప్పటికీ ఏడుకీ, ఎనిమిదికీ నడుమ రెండు ముళ్ళు పెనవేసుకున్నాయి. గుండె జారి పోయింది చెంగయ్యకి. అసలే ఎండాకాలం... అరపూట బళ్లూ, మార్నింగ్ స్కూళ్లూ అంటూ పిలకాయలంతా చీకట్తో ఎళ్ళిపోతుండారు బళ్ళకి. ఊరికి దూరంగా వున్న మొగపిల కాయల బడికి పొద్దన్నే అయితే రెండు మూడు గిరాకీలు తగిలేవి. అప్పుడెప్పుడో పూర్వకాలాన బోయిస్ స్కూలుగా వున్న దాన్ని జిల్లా పరిషత్ హైస్కూలు చేసినా, యిప్పుడది కో-ఎడ్యుకేషనే అయినా అంతా దాన్ని మొగపిలకాయల బడి అనే పిలుస్తుంటారు. అక్కడికి రెండు, మూడు ట్రిప్పులు గాని వేయ గలిగితే బాడుగ గిట్టుబాటవుతాది. ఆపైన పదకొండు దాకా బయట బాడుగలు తోలుకుని... అప్పట్నుంచీ ఎండకీ గమ్మున మూడు దాకా చెట్టుకింద పడుండొచ్చననుకున్నాడు అతను. అయితే ఈ మాయదారి నిద్ర మెలకువొచ్చింది కాదు.

"అంత మొద్దునిద్ర దేనికొచ్చింది? ఆ దేనికొస్తాది? ఊరికే తిని పడుకుంటే ఎందు కొస్తాది? తాగి పడుకుంటే వస్తాది. తన మీద తనకే కోపమొచ్చేసింది చెంగయ్యకి. ఈ నడవంతా హాయిగా వుణ్ణింది... యాడా మందు దొరక్కుండా... ఇప్పుడు కొంచెం కనపడేతలికి నాలిక పీకతా వుంది. తాగ్గూడదని ఎంతనుకున్నా ఒల్లకావడం లేదు. రంగమ్మ మూడుదినాల్నుంచీ తనతో మాట్లాడ్డం మానేసింది. దానికి తాగుడంటే మంట. తాగే మనుషులంటే అసహ్యం.

రంగమ్మ శానా తెలివయింది. చిన్నప్పట్నుండీ పెద్దరెడ్డింటి కాడ పన్లో వుండి మంచి, చెడ్డలన్నీ తెలుసుకుంది. మనిషి, కూడా బాగా తీరింది. తమ మాదిగిళ్ళల్లో మనుషులంతా నల్లటి నలుపు. రాళ్ళెత్తనూ, నాట్లకి పోనూ... ఎండా, గాలికి తిరిగి మరింత పీక్కుపోతాయి మొహాలు. అయితే రంగమ్మ అట్టా కాదు... మొదట్నుండీ నీడ పట్టునుండడంతో నలుపు కమురొదిలింది. రెడ్డెమ్మ కట్టినట్టే చీరకడ్తాది. ఆమేసుకున్నట్టే జడేసుకుంటాది. వాళ్ళింట్లో తిండి తిని చామన్చాయగా తేలింది. మొహం నున్నగా వుంటుంది. ఆ మొహం చూసేకదా మోజుపడి తాను పెళ్ళి చేసుకున్నాడు. చిరుసిగ్గుతో మెలికలు తిరిగిపోతున్నాడు చెంగయ్య.

"ఏయ్ రిక్షా వొస్తావా?" ఎవరో పిలుస్తున్నారు. చప్పున స్పృహలో కొచ్చి అటుకేసి చూశాడు. తను అవునూ, కాదూ అనే లోపుగానే పక్కనున్న మల్లిగాడు రిక్షా లాక్కెళ్ళి ఎక్కడికీ, ఏందని కూడ అడక్కుండా "ఎక్కండమ్మా" అనేశాడు.

నిట్టూర్చి గడియారంకేసి చూశాడు చెంగయ్య. అప్పటికే అరగంట గడిచిపోయింది. బేరమేదీ రాలేదు. ఇస్కూలు పిలకాయలంతా వెళ్ళిపోయినట్టుండారు.

చెంగయ్య ఆలోచనలో వుండగానే గడియారం స్థంభానికి పక్కనున్న పోలీస్టేషన్లోప ల్నుండి ఒక కానిస్టేబిల్ బయటికొచ్చాడు... వస్తూనే చెంగయ్యని చూసి దబాయిస్తూ "ఏరా ఎన్నిసార్లు చెప్పాలా....ఈ బజారు సెంటర్లో రిక్షాలు పెట్టొదని. ఫో...ఫో పక్కకి ఫో" అంటూ లాఠీ తాటించాడు. మెల్లిగా రిక్షాని గడియారం స్థంభం వెనకాల సందులోకి మళ్ళిచ్చి పెట్టు కున్నాడు చెంగయ్య.

ఎనిమిదిన్నరయ్యేటప్పటికీ గడియారం కాడుండే కూలోళ్ళ గుంపంతా చెదిరిపోయి బజారుకీ, అంగళ్ళకీ వచ్చేవాళ్ళ రద్దీ ఎక్కువయింది. ఆలస్యంగా మెలకువ రావడంతో గంజి నీళ్ళు కూడా తాగకుండా వచ్చేశాడు రంగమ్మ మీది కోపంతో. నీరసంతో కాళ్ళు లాగుతున్నాయి. ఎక్కి రిక్షా సీటు మీద కూర్చున్నాడు గునుస్తూ.

"ఏయ్ రిక్షా వస్తావా?" పిలిచాడు హార్డువేర్ షాపు సోంబాబు.

"అయ్యా" అంటూ రిక్షా దిగి ముందుకి లాగాడు చెంగయ్య.

"బస్టాండుకి పోయి సరుకు తీసుకుని మళ్ళీ యిక్కడికి రావాలి. ఎంత తీసుకుంటావు?"

"మీకు తెలీదంటయ్యా"నసిగాడు.

"చెప్పవోయ్"

"పది రూపాయిలిప్పించండయ్యా"

"ఆశ జాస్తయిపోయిందిరా మీరిక్షావాళ్ళకి... ఇంతకు ముందు బస్టాండుకి పోతే రెండు రూపాయలుల్దీసుకునే వాళ్ళు."

"అయ్యా సరుకు దీసుకోని రావాల గదయ్యా" తల గోక్కున్నాడు చెంగయ్య.

"ఎనిమిదిస్తా-పా" అంటూ చెంగయ్య మాట్లాడ్డానికి వీల్లేకుండా రిక్షా ఎక్కి కూర్చున్నాడు సోంబాబు.

చేసేదేమీ లేక పైగుడ్డ తీసి దులిపి నడుముకి కట్టుకుని సీటు మీదికెక్కాడు చెంగయ్య. బస్టాండుకి బస్సొచ్చి సరుకు సర్దుకుని తిరిగొచ్చేసరికి పదయిపోయింది.

"మంచి బేరమే...వృథాగా ఎంతయినా ధారపోస్తారు కానీ రిక్షావోడికి మాత్రం ఒక్క రూపాయి జాస్తివ్వాలంటే ఏడ్చి ఛస్తారు" మనసులో గొణుక్కున్నాడు చెంగయ్య. సోంబాబిచ్చిన ఎనిమిది రూపాయల చిల్లరా లెక్క చూసుకుంటూ-

రిక్ష పక్కన పెట్టి 'టీ' త్రాగి వచ్చాడు. అక్కడ కుళాయి వద్ద మొహం కూడ కడుక్కున్నాడు.

నీరసం కాస్త తగ్గినట్లుగా అన్పించింది.

ఇందాకటి కానిస్టేబిల్ స్టేషన్లోపల్నుండి బయటికి వస్తూ

"ఏయ్ మళ్ళీ అడ్డం బెట్టావా? అయ్య వస్తుండారు..." అన్నాడు హెచ్చరిస్తున్నట్టుగా.

చప్పున లేచి రిక్షాని పోలేరమ్మ గుడి వెనకాలికి తీసికెళ్ళి పెట్టుకున్నాడు చెంగయ్య... ఈ లోపుగా సి.ఐ., ఎస్.ఐ. బయటికొచ్చారు. మరో నలుగురు కానిస్టేబిళ్ళని ఎక్కించుకుని, సర్రున దూసుకుపోయింది జీపు జనం రద్దీని కూడ లెక్కచేయకుండా. గుడి వెనకాల నుండి జీపు వెళ్ళిపోవడం తొంగి తొంగి చూసిన చెంగయ్య, మాసిన తుండుగుడ్డతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ, మళ్ళీ రిక్షాని మెల్లిగా లాక్కుంటూ తీసికొచ్చి గడియారం స్థంభం పక్కన పెట్టాడు.

హార్డ్వేర్ అంగడి సోంబాబు తెచ్చిన సామానంతా సర్దేసినట్లున్నాడు. కౌంటర్లో కూర్చుని లెక్కలు చూసుకుంటున్నాడు.

కుదవంగడి మార్వాడీ ఆయన కస్టమర్లతో వచ్చీ రాని తెలుగులో ఏదో మాట్లాడు తున్నాడు.

రెడ్డోళ్ళ సినిమా బండి సెంటర్లో ఆపి, మంచి పాట వేస్తూ మధ్య మధ్యన మైకు చెప్తున్నాడు బండ్లో కూర్చుని మణిగాడు.

రంగమ్మకి సినిమాల పిచ్చి, ప్రతి సినిమాకీ పోదామంటుంది. ఆ సినిమాలు చూసి, వాటిల్లో ఆడోళ్ళ మాదిరిగా పేషన్లు చేస్తాది.

తమ మాదిగిళ్ళల్లో కంతటికీ రంగమ్మంటే సినిమా ఈరోయినే. అంతా బాగానే వుంటాది గానీ, తను తాగితే మాత్రం ఒప్పుకోనంటాది. తనక్కూడ తాగ్గూడదనే అన్పిస్తాది. మళ్ళీ ఏందో...? సినిమా పాటలు వింటూ ఆలోచనలో పడ్డాడుచెంగయ్య.

"రేయి చెంగా" ఎవరో జబర్దస్తీగా పిలుస్తున్నారు.

ఉలిక్కిపడి రిక్షా దిగి నాలుగువైపులా చూశాడు చెంగయ్య.

పోలీస్ స్టేషన్లోపల్నుండి బయటికొచ్చి లాఠీతో పిలుస్తున్నాడు హెడ్డు గంగయ్య. అతగాడి లావుపాటి బొజ్జ ఖాకీ చొక్కాలో యిమడలేక బజారుని తొంగి తొంగి చూస్తోంది.

"రేయి చెంగా" మళ్ళీ పిలిచాడు హెడ్డు.

'ఛఛ్ఛాన్రా దేవుడా, ఉదయాన్నే వీడి కంటబడ్డాను' తనలో తాను తిట్టుకుంటూ పైకి మాత్రం "అయ్యా" అంటూ అప్పుడే హెడ్డు పిలుపు విన్నవాడిలా పోలీస్‌స్టేషన్ కేసి నడిచాడు. ఒంగి ఒంగి దణ్ణాలు పెడుతూ, ఆ పోలేరమ్మ గుడెనకాలే వున్నా సరిపోయేది... జీపులో వీడు కూడ సచ్చాడనుకున్నాడు తను. జీపు అటు వెళ్ళగానే రిక్షా తీసుకొచ్చి గడియారం పక్కనే పెట్టినందుకు తనని తాను తిట్టుకుంటున్నాడు చెంగయ్య.

"ఏరా పిలుస్తుంటే యినపట్టంలా? కళ్ళు నెత్తికెక్కాయేంటి?" గర్జించాడు గంగయ్య.

"అయ్యా సూళ్ళేదయ్యా... ఈ సినిమాబండి గొడవలో యినపళ్ళేదయ్యా... ఏందయ్యా" తలగుడ్డ తీసి చేతిలో పట్టుకుని ఒంగి ఒంగి అడిగాడు చెంగయ్య.

"దొంగ నాయాళ్ళయిపోయార్రా మీరు... యినపడ్డాగాని యినపడనట్టే వుంటారు... బండిట్టా తీసుకురా పో" గంగయ్య మాటే గర్జనలా వుంటుంది.

తప్పదన్నట్టు పోయి బండి తీసుకొచ్చాడు చెంగయ్య.

"లోపల టి.వి. వుందిగానీ తెచ్చి బండిలో పెట్టు" బండి సొంతదారు కూడ అంత దర్జాగా, దౌర్జన్యంగా చెప్పడేమో...! మౌనంగా స్టేషను లోపలికెళ్ళాడు చెంగయ్య. లోపలి గదిలో కన్పించింది బొమ్మల పెట్టి... మామూలుగా తమ కాలనీలో చూసే బొమ్మల పెట్టికన్నా చానా పెద్దదిగా వుంది. దగ్గరికెళ్ళి పైకెత్తబోయాడు. ఉదయం నుండి ఏమీ తినకపోవడంతో కళ్ళు తిరిగినట్టయింది చెంగయ్యకి.

"తీయ్యా కొంచెం సాయం పట్టండి" అంటూ స్టేషన్లోపలున్న మరో కానిస్టేబుల్ని పిలిచాడు.

"అరె అది మొయ్యలేవా? వడ్ల మూటలయితే ఎత్తుతార్రా మీరు" అంటూ చెంగయ్య డొక్కలో పొడిచాడతడు. ఇద్దరూ కలిసి టి.వి.ని రిక్షాలోకి చేరవేశారు.

"శీనూ జాగ్రత్త... టి.వి. రిపేరుకిచ్చి గంటలోపలే వచ్చేస్తా నువ్వెక్కడికీ వెళ్ళొద్దు" అంటూ కానిస్టేబుల్ 'శీను'కి స్టేషనప్పగించి చెంగయ్య రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు హెడ్డు, టి.వి.ని ఒక చేత్తో పట్టుకుంటూ. రిక్షా ఒణికింది ఒక్కక్షణం పాటు. సీటు మీద కూర్చుని పెడలు మీద కాలు పెట్టి ఒక్క వూపుతో ముందుకు సాగాడు చెంగయ్య. ఎంత వూపుతో తొక్కుతున్నా బండి చాలా మెల్లిగా కదుల్తోంది.

"ఏందిరా చెంగా ఏంది విశేషాలు?" సిగరెట్టు వెలిగిస్తూ ప్రశ్నించాడు హెడ్డు.

"యాముండాయయ్యా మీకు తెలీనవి" నవ్వాడు చెంగయ్య నవ్వలేక.

"ఎట్టుండాయిరా రిక్షా బేరాలు... ఎంతిస్తుండావు బాడుగ"

"ఖర్మ! ఈయనగారి కాలక్షేపానికి తన బతుకే దొరికిందా?" అనుకుంటూ

"ఏం బేరాలయ్యా...పొద్దుట్నుంచీ కాసుకోనుండాను..ఒక్కరంటే ఒక్కరు కూడా ఎక్కలేదు...ఆ పెయింట్లంగటాయన బస్టాండుకి పోయొచ్చి ఎనిమిది రూపాయలిచ్చాడు. ఈడ బేరాలు దొరికినా, దొరక్కపోయినా ఆడ బండి బాడుగ మాత్రం టంచనుగా కట్టాల యిరవై రూపాయలు. బాడుగేం కట్టేది... నేనేం తినేది? పిలకాలయలకేం పెట్టేదయ్యా?"

"అయితే పిలకలాయలంట్రా నీకు? ఎంత మందేం?" సిగరెట్టు దమ్ము పీలుస్తూ అడిగాడు హెడ్డు.

"ఉండారయ్యా...దరిద్రుడికి డజను మందని వూరికే అంటారా బాబూ... వుండారు ముగ్గురు పిలకాయలు" నీరసంతో చెప్పాడు చెంగయ్య.

"అదేందిరా చెంగా అట్టంటావు... మీ యిళ్ళల్లో ఎంతమంది పిలకాయలుంటే అంత మంచిది కదా...అంతా కూలికి పోతారు" అంటూ అటునుండి యిటు సర్దుకు కూర్చున్నాడు గంగయ్య. రిక్షాకి కళ్ళుంటే తప్పకుండా నీళ్ళు కార్చి వుండేది. అయితే రిక్షా అతి కష్టం మీద నడుస్తోన్న ఆ తీరు చూస్తుంటే అది ఏడుస్తున్నట్టే వుంది.

"ఆ యాడ పోతుండారయ్యా పనికి... మాయింటిదానికి పిలకాయల్ని చదివించాలని బుద్ధి పుట్టింది. మనకెందుకే చదువులు ముందు బతికేది నేర్చుకోవాల, యాడ్నో ఒకరి దగ్గర పనికి పెడ్తే వాళ్ళ పొట్ట కెళ్ళిపోతాది. ఇంకా మిగిల్తే రెండు చిల్లర డబ్బులు మిగల్తాయి. అని ఎంత చెప్పినా యినదయ్యా. నాలుగిళ్ళల్లో పాచిపని చేసి ఆ డబ్బుల్తో పిలకాయల్ని సదివిస్తా వుండాది. వాళ్ళ గుడ్డా, గోచీ, తిండీ, పుస్తకాలూ ఎన్నో తంటాలు పడ్తా వుండాది" చెప్పుకొచ్చాడు చెంగయ్య తన చరిత్రనంతా.

"అందరికీ చదువులు కావాల్రా... గవుర్మెంటు మాత్రం యాడ్నుంచి తెస్తాది వుద్యోగాలు...? అవునూ నీ పెళ్ళాం చదువుకుందా?" కుతూహలంగా ప్రశ్నించాడు హెడ్డు.

"లేదయ్యా... సదూకున్న మీబోటి పెద్దోళ్ళింట్లో పనిచేసింది చిన్నప్పట్నుండీ. అందుకని దానికన్నీ పెద్దోళ్ళ బుద్దులే" భార్య విషయమొచ్చేటప్పటికీ తెగ మురిసిపోతూ రిక్షా ఒకింత వేగంగా లాగాడు చెంగయ్య.

"జాగ్రత్తరేయి...మరీ స్పీడయి పోతున్నావు" హెచ్చరించాడు హెడ్డు.

"మొదులే మనూరి రోడ్లు అంతంత మాత్రం"

"అవునయ్యా ఈ రోడ్లలో రిక్షా దోలడం కష్టంగా వుందయ్యా. దానికి తోడు ఎండా కాలంలో వానలేందయ్యా... వారంరోజులు వాన కురిసి వున్న గుంటలు మరీ పెద్దవై పోయాయా? మొన్నట్నుండీ కొంచెం తెరిపిచ్చింది కదా అనుకుంటే చూడయ్యా ఎండ ఎట్ట మిడిసి కాస్తా వుండాదో..."

"జాగర్త... జాగర్త... పదారువేల రూపాయిల టి.వి. అసలే రిపేరు వొచ్చిందనే బాధపడి ఛస్తున్నా..." హెడ్డు నోట్లో మాట నోట్లో వుండంగానే కాన్వెంటు నుండి యింటికెళ్తున్న చిన్న పిలగాడు తెల్లటి పువ్వులాంటి బట్టలేసుకుని టర్నింగులో నుండి రిక్షాకి అడ్డం పరిగెత్తాడు. వాడ్ని తప్పించే ఆలోచనలో పక్కనే వున్న పెద్ద గోతిలో రిక్షాని దింపేశాడు చెంగయ్య...ముందు చక్రం గోతిలో పడంగానే రిక్షా పక్కకి ఒరిగిపోయింది. టి.వి. అమాంతంగా ఎగిరి రిపేరు కోసం రోడ్డువారగా తోలివున్న గులకరాళ్ళ గుట్టమీద పడి, ఆపై గంగయ్యా పడడంతో ముక్కలయి పూరుకుంది. అంతా సినిమాలలో సీన్లా జరిగిపోయింది. కిందపడ్డ చెంగయ్య దొక్కు పోయిన మోచేతినీ, మోకాలి చిప్పల్నుండి కారుతున్న రక్తాన్నీ కూడ లెక్కచేయకుండా హెడ్డు గంగయ్య కాడికి పరిగెత్తాడు. ఆ మాటకొస్తే గంగయ్య హెడ్డు కూడ తనకి తగిలిన

దెబ్బల గురించేమీ లెక్కచేయలేదు. పట్టించుకోలేదు. మెల్లిగా లేచి కూర్చుని తన బొమ్మల పెట్టికేసి చూసుకున్నాడు.

అందులో నుండి 'యిక బొమ్మలు రావు' అన్న నగ్న సత్యాన్ని జీర్ణించుకోలేని ఆవేశం గంగయ్యని నిలవనిచ్చింది కాదు. వెంటనే చుట్టుపక్కల వాళ్లెవరో తనని మెల్లిగా పైకి లేపడానికి ప్రయత్నిస్తున్నా పట్టించుకోకుండా తనే ఒక్క ఉదుటున లేచి ముందూ, వెనుకా ఆలోచన చేయకుండా చెంగయ్య జుట్టు పట్టుకున్నాడు.

"బాడ్కోవ్! కళ్ళు నెత్తినెక్కి ఉండాయిరా మీకు... ఎక్కినప్పట్నుండీ చెప్తానే వుండా... జాగ్రర్తొరేయ్ అని. పదారు వేలు ఎవరు కడ్తార్రా నీయబ్బ... ఎవరొస్తారో రానీయి...వొచ్చి డబ్బు కట్టి నిన్నిడిపించుకుపోవాల బంచత్. పద స్టేషనుకి నాకొడకా..." అంటూ మరో రిక్షా పిలిచి చెంగయ్యని దాంట్లోకి తోసి తనూ ఎక్కి కూర్చున్నాడు హెడ్డు. అతడికి తెలిసిన వాళ్ళెవరో గంగయ్యని వారించాలని చూసి అతడి ఆవేశం అణిచిపెట్టిన స్ప్రింగులా మరింత పైకి లేస్తుండ డంతో ఆ ప్రయత్నం మానుకుని నేలపాలయిన టి.వి.ని రిక్షాలోకి చేర్చి రిపేరు షాపుకి తీసికెళ్ళారు.

స్టేషన్లో ఎవరూ లేకపోవడంతో తాపీగా కూర్చుని ప్రియురాలికి ప్రేమలేఖ వ్రాసు కుంటున్న శీను, హెడ్డు ఇంత త్వరగా తిరిగి రావడాన్ని జీర్ణించుకోలేక చప్పున కాగితాలు దాచేసి ఠక్కున లేచి నిలబడ్డాడు.

"ఏం జరిగింది సార్!" అంటూ

చెంగయ్యని లోపల్దోసి మరోసారి కాలితో తన్ని వచ్చి కుర్చీలో కూలబడ్డాడు గంగయ్య తలని రెండు చేతుల్లో యిరికించి.

అప్పటికే దాదాపుగా స్పృహ తప్పిపోయాడు చెంగయ్య. వాడికి నోట మాట రావడం లేదు. జరిగిన సంఘటన ఎంత ప్రయత్నించినా బుర్రకెక్కడం లేదు. హెడ్డు గంగయ్యకి కూడా టి.వి. పగిలిపోయిన సంగతి జీర్ణించుకోవడం కష్టంగా వుంది. నానా గడ్డీ తిని కొన్న టి.వి. పిల్లలకీ, పెళ్ళానికీ అదంటే ప్రాణం. ఒక్కరోజు రిపేరు కొచ్చినా భరించలేని వాళ్ళు ఇప్పుడిహ టి.వి.యే ఇంటికి రాదంటే ఎట్లా ఫీలవుతారు. అసలు తనేవని జవాబు చెప్తాడు వాళ్ళకి. గంగయ్యకి ఆలోచించే కొద్దీ మతిపోతున్నట్లుగా వుంది. చెంగయ్యకి దాదాపుగా మతే పోయింది పిచ్చెక్కినట్లుగా వుంది ఇద్దరికీ.

సాయంత్రమై పోయింది. చెంగయ్య తిండీ, తిప్పలూ కనీసం తాగడానికి మంచి నీళ్ళయినా లేకుండా ఆ నాలుగ్గోడల నడుమా పడి వున్నాడు. నిజానికి గంగయ్యకి కూడ ఆ మధ్యాహ్నం తిండి సహించలేదు . టీల మీద టీలు, సిగరెట్ల మీద సిగరెట్లు కాల్చేస్తున్నాడు.

ఎస్.ఐ., సి.ఐ.లు స్టేషన్లో లేకపోవడం, మరే యితర కేసులూ ఆ రోజుకి రాకపోవడం ఒక విధంగా మంచిదే అయింది హెడ్డు గంగయ్యకి.

చీకటిపడే వేళకి రంగమ్మ యేడుస్తూ పెద్దకొడుకుని తోడు తీసుకుని స్టేషన్లోకి అడుగు పెట్టింది. మధ్యాహ్నం మొగుడు ఇంటికి రాకపోతే బేరాలు బాగా దొరికుంటాయి లెమ్మని

సరిపెట్టుకుంది. ఒక్కోసారి దూరాభారాలు వెళ్ళినపుడు, మధ్యాహ్నం పూట మొగుడు ఇంటికి రాకపోవడం మామూలే.

ఆరుగంటలకి పాచిపని చేసుకుని ఇంటికొచ్చేతలికి నాలుగిళ్ళవతల వుండే వెంకటయ్యా వచ్చి చెప్పాడు 'అక్కా బావ యిట్టా స్టేషన్లో వుండాడంట' అని అదిరిపోయింది. రంగమ్మ రాగానే హెడ్డుకి దణ్ణం పెడుతూ

"అయ్యా నా మొగుడు అమాయకుడయ్యా అసలేమీ తెలీనోడు. ఎట్టయినా ఈ ఒక్క తప్పు మన్నించండి" అంది.

ఒక్క క్షణం రంగమ్మ కేసి నిశితంగా చూశాడు హెడ్డు. అసలే చిన్నవయిన అతడి కళ్ళు మరింత చిన్నవయ్యాయి. ముదురు నుదురు మడతలు పడింది. క్షణం తరువాత క్రమంగా అర్థమయిందతడకీ ఆ వచ్చింది రిక్షా చెంగయ్య భార్య అన్న విషయం.

రంగమ్మని చూసి విస్తుపోయాడు హెడ్డు.

చామనఛాయలో నున్నగా మెరిసిపోతున్న ముఖంలో కదలాడే కళ్ళు... సన్నటి లేత గులాబీ రేకుల్లాటి పెదవులూ, పైకి బఫ్‌లా దువ్వి పిన్నులెట్టి వేసుకున్న జడా, షేప్ జాకెట్లో అందంగా ముందుకు సాగి నిలిచిన ఎదా, కూర్చినట్లుగా వున్న చీరకట్టు ఎవరో మధ్యతరగతి చదువుకున్న గృహిణిలా వుందే తప్ప మాదిగ చెంగయ్య భార్యలా లేదు. రిక్షా చెంగయ్యకి ఇంత అందమైన పెళ్ళామా? మింగుడుపడలేదు హెడ్డుకి.

చప్పున నల్లగా, భారమైన శరీరంతో కదల్లేకుండా తుమ్మమొద్దులా వుండే తన భార్య గుర్తొచ్చింది హెడ్డుకి. వెంటనే వెగటూ కలిగింది.

ఉదయం నుండి ఏర్పడ్డ దిగులూ, నిస్పృహ అంతా రంగమ్మని చూడగానే క్రమంగా మాయమయిపోయి పెదాల్లోకి చిరునవ్వు ప్రాకింది. కళ్ళల్లోకి వెలుతురు వచ్చింది. మెల్లిగా కుర్చీలో నుండి లేచి టేబిలు దాటి మృదువుగా అడుగులు వేస్తూ యివతలికి వచ్చాడు హెడ్డు గంగయ్య.

"ఎవరు నువ్వు? ఏం కావాలి" అన్నాడు ఏమీ ఎరగనట్టుగా.

"అయ్యా నేను రిక్షా ఏసే చెంగయ్య భార్యని నాపేరు రంగమ్మ. వుండి తిన్నా లేక పస్తులున్నా ఏదో మా బతుకు మేము బతుకుతున్నోళ్ళమేగాని ఎవ్వరి జోలికీ పోయేవాళ్ళమే కాదయ్యా. దయవుంచి వదిలేయండయ్యా ఈ ఒక్కసారికీ మన్నించండి" బతిమాలుతున్నట్లుగా అడిగింది రంగమ్మ.

అలా బతిమాలుతూ, వేడుకుంటోన్న రంగమ్మ కేసి నిశితంగా చూస్తూ "ఏం శీనూ వదిలెయ్యమంటోంది... వదిలేద్దామా?" కన్ను గీటుతూ నవ్వాడు గంగయ్య హెడ్డు.

"ఏంది వదిలేది? అయ్యగారి టి.వి. ఒకటా, రెండా పదారు వేలది. ఒక్క నిముషంలో బద్దలు చేశాడు నీమొగుడు, అదేమంటే గతుకులో పడ్డాదంటాడు. గతుకులుంటే మాత్రం చూసుకు నడపద్దా? ఇప్పుడు పోయిన వస్తువు తిరిగి రమ్మంటే వస్తాదా? నీ మొగుడు చేసింది మంచిపని కాదు" హెడ్డుగారి మెప్పు కొట్టేయాలని మరీ విజృంభించేశాడు కానిస్టేబుల్ శీను.

ఇంతలో మరో కానిస్టేబుల్ సెల్‌లో నుండి చెంగయ్యని తీసుకొచ్చి హెడ్డు ముందర నిలబెట్టాడు. చెంగయ్య మెడ వాలిపోతూ, ఆ సమయంలో అక్కడ రంగమ్మని చూడగానే ఏదో జరగరానిది జరిగినట్లుగా స్టడీ అయిపోయింది.

"ఏరా చెంగా నీ పెళ్ళామొచ్చింది" హెడ్డు గొంతులోని వ్యంగ్యానికి కడుపులో రేగిన కసిని అణుచుకుంటూ తలవంచుకుని కళ్ళు మూసుకున్నాడుచెంగయ్య.

చెంగయ్యకి దు:ఖం ఆపుకోవడం కష్టంగా వుంది. రంగమ్మ చెంగయ్యకేసి హెడ్డుకేసి మార్చి మార్చి చూస్తూ కళ్ళలో తిరుగుతున్న కన్నీళ్ళనీ తుడుచుకుంటూ మరోసారి బతిమాలుకోవడానికి సిద్ధపడ్తోంది. గడ్డం తడువుకుంటూ అటు, ఇటు పచార్లు చేస్తోన్న హెడ్డు హఠాత్తుగా ఆగాడు. ఒక్కసారిగా భరించలేని నిశ్శబ్దం... ఒక్క నిముషం తర్వాత అన్నాడు హెడ్డు ఆలోచిస్తున్నట్లుగా.

"పొద్దుట్నుండీ ఈ చెంగయ్య దగ్గర పదారు వేలూ ఎట్టా రాబట్టుగోగలనా అని చింతపడ్తుండాను. ఇప్పుడు దొరికిందిరా ఛెంగా" ఈ పదాలని ఒత్తి ఒత్తి పలుకుతూ వెటకారంగా ధ్వనించిందతడి గొంతు.

"మా దగ్గిర అంత డబ్బేదయ్యా? వంద రూపాయిలే ఏనాడూ చూళ్ళేదు. వేలంటే మాటలా? ఈ జన్మంతా పనిచేసినా మేము తేలేము. దయవుంచి మీరే పెద్ద మనసు చేసుకుని వదలాలి" ఉదయం నుండి చెప్తోన్న మాటలే అయినా మళ్ళీ మళ్ళీ మరోసారి చెప్పాడు చెంగయ్య. అతడి కళ్ళల్లో తడి లేదు. గుండెల్లోనూ తడారిపోయినట్లుగా వుంది. మెల్లిగా తలెత్తి భార్య మొహంలోకి చూశాడు. ఆమె ఎందుకోగాని బాధని అణచుకోబోతూ, అణచుకోవడం చేతకాని దానిలా వెక్కివెక్కి ఏడవసాగింది. మళ్ళీ అంతలోనే దు:ఖాన్ని లోలోపలే దిగమింగుకుంటూ ఏడుస్తోన్న కొడుకు తల నిమిరి సముదాయిస్తూ హెడ్డుకేసి ఆతృతగా చూస్తోంది రంగమ్మ.

"ఇంత అందమైన పెళ్ళాన్ని పెట్టుకుని డబ్బు లేద తెచ్చేదంటావేమిరా పిచ్చి చెంగా... సెంటర్లో నిలబడమను రాసులు కురుస్తాయట్నే. నాబాకీ ఆరునెలల్లో తీర్చేయొచ్చు. ఆరు నెలలు కూడ పట్టలేదులే" రంగమ్మ కేసి చూస్తూ కన్ను గీటాడు హెడ్డు. అంతటితో ఆగక చెయ్యి పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు.

"నీ యమ్మ... నాకే ఆపుకోవడం కష్టంగా వుందే ...ప్చ్" అన్నాడు.

అంత నీరసంలోనూ చెంగయ్య కళ్ళు ఎఱ్ఱబడ్డాయి.

గంగయ్య తన బొమ్మలపెట్టి కోసం... రంగమ్మని అంగడి బొమ్మగా నిలబడమంటున్నాడన్న సంగతి అర్థమయ్యాక ఎక్కడలేని శక్తిని తెచ్చుకుని ఎగిరి రెండు కాళ్ళతో హెడ్డు గుండెల మీద తన్నాడు చెంగయ్య.

ఆ తర్వాత చెంగయ్య ఏమయ్యాడు? రంగమ్మ దీనస్థితి ఏమిటి? అనే విషయాన్ని మనం మాట్లాడుకోకుండా వుండడమే మంచిది.

ఆదివారం ఆంధ్రజ్యోతి, 1998